




# ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 114,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,మంగళవారం, తేదీ : 01-09-2026


## స్మార్ట్‌ఫోన్ తయారీలో 18 శాతానికి చేరిన భారత వాటా




- ★ 90 శాతానికి పైగా చైనా, భారత్, వియత్నాం వాటా
- ★ 20 రెట్లకు పైగా పెరిగిన భారత్‌లో మొబైల్ ఉత్పత్తి
- ★ 100 రెట్లకు పైగా పెరిగిన మొబైల్ ఎగుమతులు
- ★ ఐఫోన్లలో నాలుగో వంతు భారత్‌లో అసెంబుల్

## రక్షణ రంగంలో విదేశీ పెట్టుబడులు నిబంధనలు సడలించే యోచనలో కేంద్ర ప్రభుత్వం!

- త్వరలో రక్షణ రంగంలోనూ విదేశీ పెట్టుబడుల ప్రవాహం
- నిబంధనల్ని సడలించే యోచనలో కేంద్రం ఉన్నటు విశ్వసనీయ వర్గాల సమాచారం
- 2029 నాటికి రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 3 లక్షల కోట్లను చేరుకోవడమే లక్ష్యం!

ఢిల్లి : భారత్‌లో రక్షణ తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు విదేశీ




పెట్టుబడుల్ని ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్పుల దిశగా ఆలోచిస్తోంది. రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సడలించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ విషయంపై డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ సంబంధిత పరిశ్రమల భాగస్వాములతో సంప్రదింపులు నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం చూస్తే రక్షణ రంగంలో 74 శాతం వరకు ఎఫ్‌డీఐని ఆటోమేటిక్ రూట్‌లో అనుమతిస్తున్నారు. అంటే దీని కోసం ఎలాంటి ముందస్తు అనుమతులు అవసరం లేదు. 74 శాతానికి మించి విదేశీ పెట్టుబడులు రావాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ముఖ్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మిగతా..2లో

# ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధాని మోదీ భేటీ..

- ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో ద్వైపాక్షిక భేటీ నిర్వహించారు.
- కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో సోమవారం ఈ సమావేశం జరిగింది.
- షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ,




ఢిల్లి: షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో ద్వైపాక్షిక భేటీ నిర్వహించారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో సోమవారం ఈ సమావేశం జరిగింది. ఫిబ్రవరిలో ఇరాన్-అమెరికా యుద్ధం ప్రారంభమైన తర్వాత మిగతా..2లో

## ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం.. రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్




- ★ వెలిగొండకు కృష్ణా జలాల తరలింపుపై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు
- ★ తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపణ
- ★ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్ విఫలమయ్యారని ధ్వజం
- ★ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్
- ★ కృష్ణా బోర్డు ప్రేక్షకపాత్ర పోషిస్తోందని హరీశ్ రావు ఆక్షేపణ

హైదరాబాద్ : మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి..

- హైదరాబాద్‌లోని మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.
- ఈ బ్రిడ్జిని రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవుతో నిర్మించగా.. సోమవారం నాడు సీఎం ప్రారంభోత్సవం చేశారు.




హైదరాబాద్: మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ బ్రిడ్జిని రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవుతో నిర్మించగా.. సీఎం నేడు (సోమవారం) ప్రారంభోత్సవం చేశారు. మూసీ నదిలో లక్షా యాభై వేల క్యూసెక్కుల వరద వచ్చినా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పటిష్ఠంగా దీనిని నిర్మించారు. ఈ బ్రిడ్జితో అంబర్‌పేట, మూసారాంబాగ్ ప్రాంతాలకు ప్రయాణాలు సులభం కానున్నాయి. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, శ్రీ గణేశ్, నవీన్ యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ మధు యాష్కీ, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'.. సభలో బోరున విలపించిన కవిత



- ★ బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత
- ★ సభలో కన్నీటి పర్యంతమైన కవిత
- ★ "కవిత సీఎం" అంటూ కార్యకర్తల నినాదాలు
- ★ కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత
- ★ తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో సమాధానమిస్తామని ప్రతిన

హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. "నాతో ఎందుకు ఇలా చేయాలి?" అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. మిగతా..2లో

## రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన




- సెప్టెంబర్ 1, 2 తేదీల్లో వైఎస్ జగన్ పులివెందుల పర్యటన
- వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్
- ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తండ్రికి నివాళులు
- పర్యటనలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండనున్న మాజీ సీఎం

అమరావతి: వైసీపీ అధినేత జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ పర్యటన జరగనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో జగన్ పాల్గొననున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జగన్ పులివెందుల చేరుకుంటారు. మిగతా..2లో

## తెలంగాణలో తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నాం



- తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
- కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్, ఆగస్టు 31 : తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ (సోమవారం) పరిశీలించారు. మిగతా..2లో

## నకిలీ ప్రారంభోత్సవాలు వైఎస్సార్సీపీకే సొంతం




- ★ వెలిగొండ తన ఘనతంటూ జగన్ పోస్టు
- ★ 2024లోనే గత ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభించిన వీడియో
- ★ నీళ్లు లేని ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం ఏంటని ఎద్దేవా చేసిన లోకేశ్

అమరావతి: వెలిగొండ తన ఘనతంటూ జగన్ చేసిన పోస్టుకు మంత్రి నారా లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 2024లో నీళ్లు లేకుండానే వెలిగొండ ప్రాజెక్టును జగన్ ప్రారంభించారని ఎద్దేవా చేశారు. జగన్ పోస్టులోని విజువల్స్‌ను నిశితంగా పరిశీలిస్తే అసలు విషయం అర్థమవుతుందని, నీరు లేని ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేసి చరిత్ర సృష్టించారని విమర్శించారు.

# మాట ఇచ్చి నిలబెట్టుకున్నా వెలిగొండ బంగారు కొండ అవుతుంది

- వెలిగొండ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు
- నిమ్మల రామానాయుడిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్న సీఎం
- నిర్వాసితులు కూడా సంతోషంగా ఉండాలనేది తన ఆకాంక్ష అన్న చంద్రబాబు
- వెలిగొండ బంగారు కొండ అవుతుంది

అమరావతి: వెలిగొండ బంగారు కొండ అవుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మాట ఇచ్చి నిలబెట్టుకున్నామని, ప్రాజెక్టు పూర్తి చేశామని చెప్పారు. కృష్ణమ్మ తెచ్చామని, కరవును తరిమికొడుతున్నామని తెలిపారు. '30 ఏళ్లకు మునుపు చంద్రబాబు అనే నేను 1996 మార్చిన భూమిపూజ చేశా, 30 సంవత్సరాల తర్వాత మొదటి దశ ప్రారంభించి జాతికి అంకితం చేశానని స్పష్టం చేశారు. వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు పాల్గొని మాట్లాడారు. 2019లో గొడ్డలి పార్టీ రాకతో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని చంద్రబాబు విమర్శించారు. 2024లో వెలిగొండకు పట్టిన గ్రహణం వీడిందన్నారు. గత ప్రభుత్వంలో కేవలం 2.77 శాతమే పనులు చేశారన్నారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొర చెల్లింపులతో మోసం చేశారని మండిపడ్డారు. వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసినట్లు డ్రామాలాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ ప్రచారాలతో కరవు రైతుల జీవితాలతో ఆడుకున్నవారిని ఏమనాలని చంద్రబాబు ప్రశ్నించారు. 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, తాను కలిసి రాష్ట్ర పునర్నిర్మాణంపై మాట ఇచ్చామని చంద్రబాబు గుర్తు చేశారు. తమపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యమిచ్చారని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల ఏపీకి అన్నీ ప్రయోజనాలేనని తెలిపారు. మోదీ సహాయం మిత్రుడు పవన్ సహకారంతో ముందుకెళు_న్నామన్నారు. కరవుతో పోరాడిన రైతన్నకు కృష్ణా



జలాలతో స్వాగతం పలికామని చంద్రబాబు వెల్లడించారు. 'వాన కోసం ఆకాశం వైపు చూసిన రైతుల బాధలు చూశాం. బోరు వేస్తే నీళ్లు పడక అప్పుల్లో కూరుకుపోయిన కుటుంబాలను చూశాం. పనులు దొరక్క ఊరు విడిచి వెళ్లిన కూలీలనూ చూశాం. ఇక ఆ పరిస్థితులు ఉండవు ఫ్లోరైడ్ అనే పదం మరచిపోతాం. వెలిగొండ ప్రాజెక్టుకు భూములు త్యాగం చేసిన ప్రజలకు పాదాభివందనం చేస్తున్నా. కరవుపై గెలవాలన్న సంకల్పంతో ముందడుగు వేశాం. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టానికి ముగింపు. కరవు నేలపై కృష్ణమ్మ రాసిన మిగతా..2లో

## పరిశ్రమలకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు.. 33శాతం పచ్చదనం తప్పనిసరి




- ఏపీ ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.
- రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు.

అమరావతి, ఆగస్టు 31: ఏపీ ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం మిగతా..2లో

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక
మంగళవారం 01-09-2026

మొదటి పేజి తరువాయి

## పరిశ్రమలకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు..

# 33శాతం పచ్చదనం తప్పనిసరి

పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు. పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం వల్ల వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని డిప్యూటీ సీఎం తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం అందరి బాధ్యతన్నారు. అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. ఏపీవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పవన్ ఆదేశించారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'..

# సభలో బోరున విలపించిన కవిత

నిజామాబాద్‌లో నిర్వహించిన తన పార్టీ పాంచజన్య సభలో కవిత మాట్లాడారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన ఆమె.. బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదన్నారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పారు. కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు "కవిత సీఎం.. సీఎం" అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పారు. అందుకే కొత్త పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని చెప్పారు. ఏ తప్పు చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు.

## ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో

# ప్రధాని మోదీ భేటీ.. కీలక సమయంలో చర్చలు..

ఇరువురు నేతలు ప్రత్యక్షంగా కలుసుకోవడం ఇదే తొలిసారి . భారత్-ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాల తాజా పరిస్థితిని ఇరువురు నేతలు సమీక్షించారు. పరస్పర ఆసక్తి ఉన్న రంగాల్లో రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసి, విస్తరించాల్సిన అవసరం గురించి చర్చించారు. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న సమయంలో ఈ కీలక భేటీ జరగడం ఆసక్తికరంగా మారింది అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం, హోర్ముజ్ జలసంధి మూసివేత, అమెరికా ఆంక్షల కారణంగా భారత్ సహా పలు దేశాల వాణిజ్య కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది. భారత్‌కు ఇరాన్ భౌగోళికంగా, వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలక దేశం. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు, హోర్ముజ్ జలసంధి మూసివేత, ఇరాన్‌పై అమెరికా ఆంక్షల నేపథ్యంలో మోదీ, పెజెష్కియాన్ ముఖాముఖి చర్చలు జరపడం రెండు దేశాల భవిష్యత్ సహకారానికి కీలక పరిణామంగా మారింది ఎస్‌సీఓ సదస్సు సందర్భంగా మోదీ ఇప్పటికే అర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తో కూడా సమావేశమయ్యారు. రక్షణ, ఆర్థిక వ్యవహారాలు, ఫార్మా, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్య వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంపై ఇరువురు చర్చించారు. అలాగే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కూడా మోదీ భేటీ కావాల్సి ఉంది. అలాగే కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదీర్ జపరోవ్ ఆహ్వానం మేరకు 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మోదీ పాల్గొననున్నారు.

## తెలంగాణలో తొలిసారిగా

# కవచ్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నాం

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. మహబూబ్‌నగర్‌ను రైల్వేహాబ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. 5 వందేభారత్ రైళ్లను కేంద్రప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిందని ప్రస్తావించారు. మోదీ హయాంలోని పదేళ్లలో 100 కొత్త రైళ్లను తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు.

### తెలంగాణలో 42 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నాం..

తెలంగాణలో 42 రైల్వేస్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొచ్చారు. 2014కు ముందు రైల్వేస్టేషన్లు అధ్వానంగా ఉండేవని.. కానీ నేడు మోదీ హయాంలో పరిస్థితి మారిందని తెలిపారు. ప్రయాణికులు భాగస్వాములైతే స్వచ్ఛస్టేషన్లు సాధ్యమవుతాయని వివరించారు. రైల్వేస్టేషన్లు ఏయిర్‌పోర్టు స్థాయిలో ఉండాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఉద్ఘాటించారు.

### తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు..

2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో రూ.886 కోట్ల రైల్వేబడ్జెట్ ఉంటే 2026-27 బడ్జెట్‌లో తెలంగాణకే రూ.5454 కోట్లను కేంద్రం కేటాయించిందని కిషన్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి తెలంగాణలో రైల్వే రంగం నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రవేశపెడితే.. తెలంగాణకు మూడు ఇచ్చామని.. ఇది రైల్వేరంగంలో సువర్ణాధ్యాయమని నొక్కిచెప్పారు. రూ.5 లక్షల కోట్లతో బుల్లెట్ ట్రైన్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా దేశంలోనే తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను తెలంగాణలో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన

అనంతరం భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఆ రోజు రాత్రికి పులివెందులలోని తన నివాసంలోనే బస చేస్తారు. ఇక సెప్టెంబర్ 2వ తేదీన ఉదయం పులివెందుల నివాసం నుంచి బయలుదేరి 7:45 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. అక్క వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తారు. వర్ధంతి కార్యక్రమం పూర్తయిన అనంతరం జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రతీ ఏటా వైఎస్సార్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలకు జగన్ హాజరై నివాళులు అర్పించడం తెలిసిందే.

## ప్రతి ఒక్కరూ శాంతియుతంగా,

# చట్టబద్ధంగా ప్రవర్తిస్తారని ఆశిస్తున్నాం'

సెప్టెంబర్ 5న కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన నిరసనలపై నిషేధం కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణకు సుప్రీం నిరాకరణ- ప్రతిఒక్కరూ శాంతియుతంగా, చట్టబద్ధంగా ప్రవర్తిస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడి

సెప్టెంబర్ 5న కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన నిరసనలపై నిషేధం కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణకు సుప్రీం కోర్టు సోమవారం నిరాకరించింది. అత్యవసరంగా జోక్యం చేసుకోవాలంటూ దాఖలైన పిల్ పై ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. శాంతిభద్రతల పరిరక్షణ ప్రభుత్వం, పోలీసుల బాధ్యత అని పేర్కొంది. ఈ ప్రదర్శన ఏదైనా అవాంఛనీయ ఘటనకు దారితీస్తుందని భావించడానికి ఈ దశలో ఎటువంటి కారణం లేదని అభిప్రాయపడింది. నీట్ నిరసనల సమయంలో పోలీసుల హింస ఆరోపణలను పరిశీలించేందుకు తాము ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి విచారణ కమిటీకి తన పిటిషన్‌ను సమర్పించాలని పిటిషనర్‌కు సూచించింది. విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఇతర విషయాలతో పాటు ఈ పిటిషన్‌ను కూడా సెప్టెంబర్ 10కి వాయిదా వేసింది. "ఇప్పటికైతే, ప్రతి ఒక్కరూ శాంతియుతంగా ప్రవర్తిస్తారని మేము భావిస్తున్నాం. ప్రస్తుతం ఏదైనా అవాంఛనీయ ఘటన జరుగుతుందని భావించడానికి బలమైన పరిస్థితులు ఏవీ లేవు. శాంతిభద్రతలను కాపాడటం వారి బాధ్యత. ఏది చట్టవిరుద్ధమో, ఏది అనుమతించేదో చెబుతూ శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత అమలు చేసే ఏజెన్సీకి ఉంది. వారు ఆ పరిధిలోనే వ్యవహరిస్తారని మేము ఆశిస్తున్నాం. ఇరుపక్షాలు దేశ చట్టాన్ని గౌరవిస్తాయి. దానికి అనుగుణంగా ప్రవర్తిస్తాయని, పాటిస్తాయని మేము ఆశిస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో పాటు దీనిని కూడా జాబితాలో చేర్చండి. సెప్టెంబర్ 10న విచారణ జరపాలి." అని ధర్మాసనం పేర్కొంది. రిటైర్డ్ ఢిల్లీ పోలీస్ అధికారి రాజేంద్ర సింగ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ఇండియా గేట్, సెంట్రల్ విస్టా, సమీప ప్రాంతాలతో సహా భద్రతాపరంగా సున్నితమైన ప్రదేశాల్లో పెద్ద ఎత్తున జన సమీకరణ, ర్యాలీ, ప్రదర్శన కోసం ఇచ్చే ఏ బహిరంగ పిలుపుపైనా, నిర్వాహకులు ముందుగా అవసరమైన అనుమతులు పొందే వరకు చర్యలు తీసుకోరాదని ఆదేశించాలని కోరారు. సెప్టెంబర్ 12-13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ముగిసే వరకు లూటియన్స్ ఢిల్లీలో ప్రతిపాదిత నిరసనలను నియంత్రించాలని, వాయిదా వేయాలని లేదా తగిన విధంగా మార్చాలంటూ కూడా ఈ పిటిషన్‌లో కోరారు. సదస్సు సమయంలో ఢిల్లీలో అంతర్జాతీయ ప్రముఖులు, మీడియా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# నకిలీ ప్రారంభోత్సవాలు వైఎస్సార్సీపీకే సొంతం

మొదటి పేజి తరువాయి



ఇది నకిలీ ప్రారంభోత్సవమని, ఇలాంటి ఘనత వైఎస్సార్సీపీకి మాత్రమే దక్కుతుందని లోకేశ్ సోషల్ మీడియా వేదికగా దుయ్యబట్టారు.వెలిగొండ రాజశేఖర్ రెడ్డి కళ అన్న జగన్: వెలిగొండ ప్రాజెక్ట్ విషయంలో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ఎదురుదాడి చేశారు. ఈ ప్రాజెక్ట్ ఘనతను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు "కాజేయడానికి" ప్రయత్నిస్తున్నారని జగన్ 'ఎక్స్' వేదికగా ఆరోపించడంతో ఈ రాజకీయ వివాదం ముదిరింది. 1996లో చంద్రబాబు కేవలం శంకుస్థాపన మాత్రమే చేశారని, కానీ దీని వెనుక ఉన్న అసలు దార్శనికత వైఎస్ రాజశేఖర రెడ్డిదేనని, అలాగే కీలకమైన జంట సొరంగ మార్గాల నిర్మాణం వైఎస్సార్సీపీ హయాంలోనే పూర్తయిందని జగన్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన ట్రయల్ రన్, సంబరాలను ఆయన కేవలం "ప్రచార ఆర్భాటాలు"గా కొట్టిపారేశారు. నారా లోకేశ్ ఎదురుదాడి: జగన్ ఆరోపణలకు 'ఎక్స్' వేదికగా నేరుగా స్పందించిన నారా లోకేశ్, మాజీ ముఖ్యమంత్రి తన హయాంలో "నకిలీ ప్రారంభోత్సవం" చేశారని ఎండగట్టారు. "నీళ్లు లేని ప్రారంభోత్సవం"పై ఎద్దేవా చేశారు. 2024 నాటి దృశ్యాలను నిశితంగా గమనించాలని ప్రజలను లోకేశ్ కోరారు. "2024లో జగన్ చరిత్ర సృష్టించారు. నీళ్లు లేని సాగునీటి ప్రాజెక్టును ప్రారంభించారు. ఒక నకిలీ ప్రారంభోత్సవం - ఇది కేవలం వైఎస్సార్సీపీకే సాధ్యం". తన స్పందనతో పాటు కొన్ని హ్యాష్‌ట్యాగ్‌లను కూడా పోస్టు కింద జత చేశారు. అందులో 'ఫేక్ జగన్', 'డ్రీమ్ వెలిగొండ ప్రాజెక్ట్' వంటివి ఉన్నాయి. ఇవి ప్రస్తుతం సామాజిక మాధ్యమాలలో ట్రెండింగ్‌గా మారాయి. 30 ఏళ్ల కల సాకారం: దశాబ్దాల నిరీక్షణ తర్వాత టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం హయాంలో వెలిగొండ సొరంగం గుండా కృష్ణా జలాలు మొదటిసారిగా ప్రవహించాయని లోకేశ్ నొక్కి చెప్పారు. కరువు పీడిత ప్రాంతానికి ఇది చారిత్రాత్మక జీవనాడి అని ఆయన అభివర్ణించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం అనేది కేవలం రాజకీయ అంశం మాత్రమే కాదని, ప్రస్తుత ప్రభుత్వ దృఢమైన విధానమని ఆయన స్పష్టం చేశారు.

# ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం.. రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్

మొదటి పేజి తరువాయి



వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. వరద నీరు లేకున్నా, ఎటువంటి కేటాయింపులు లేకుండానే కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం వెలిగొండ ద్వారా నీటిని యథేచ్ఛగా తరలిస్తోందని హరీశ్ రావు ఆక్షేపించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు. ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ఏపీకి పరోక్షంగా సహకరించడమేనని ఆరోపించారు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సైతం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ వివాదంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపేలా చూడాలని, తద్వారా ఆయకట్టుకు నీరందించాలని కోరారు.

# మాట ఇచ్చి నిలబెట్టుకున్నా - వెలిగొండ బంగారు కొండ అవుతుంది

మొదటి పేజి తరువాయి



కొత్త చరిత్రని' చంద్రబాబు వ్యాఖ్యానించారు. "నాడు చేసిన సంకల్పం నేడు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. నాడు వేసిన పునాదిరాయి నేడు కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది. ఇది భగీరథ ప్రయత్నం కొండలు వస్తే తొలచి ముందుకెళ్లాం. ఎదురైన ప్రతి సవాల్‌ను అధిగమించి ముందుకెళ్లాం. వెలిగొండ కోసం పనిచేసిన ప్రతిఒక్కరికీ అభినందనలు. నిమ్మల రామానాయుడిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. నిర్వాసితులు కూడా సంతోషంగా ఉండాలనేది నా ఆకాంక్ష. ఆర్థికంగా కష్టాలున్నా ఎక్కడా వెనుకడుగు వేయలేదు.చేతగాకపోతే తప్పు లేదు చేశామని మోసం చేస్తేనే పెద్ద తప్పు. ఫేక్ మాటలు చెప్పేవారిని నిలదీయకపోతే అవే వాస్తవాలు అనుకుంటారు. ఆవేదనతో చెబుతున్నా ఫేక్ మాటలను సమర్థంగా తిప్పికొట్టాలి." - చంద్రబాబు, ముఖ్యమంత్రి 'శ్రీశైలం ప్రాజెక్టులోని కొల్లం వాగు నుంచి నీటిని గ్రావిటీ ద్వారా తెస్తున్నాం. 53 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం కలుగుతుంది. రూ.10,200 కోట్ల ప్రాజెక్టు వ్యయంలో రూ.7,983 కోట్లతో మొదటి దశ పూర్తిచేశాం. 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాల్వల పనులు పూర్తిచేశాం. 48 రోజుల్లోనే 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లు పరిహారం అందించాం. ఆర్థికంగా కష్టాలున్నా మీ బాధలు గుర్తించి అదనంగా మరో రూ.169 కోట్లు చెల్లిస్తున్నాం. కటాఫ్ డేట్ పెంచి 18 ఏళ్లు నిండిన యువత ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ఇస్తున్నామని' చంద్రబాబు తెలిపారు. నల్లమల సాగర్ నుంచి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా నీరిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. సెప్టెంబర్‌లో లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టులో మార్కాపురాన్ని భాగం చేశామన్నారు. వెనుకబడిన ఈ ప్రాంతం పొరుగు జిల్లాలకు పోటీగా నిలుస్తుందని చెప్పారు. వెలిగొండ తొలి దశతో ఆగము ఫేజ్ 2 కూడా 2028కి పూర్తి చేస్తాం. 2047 స్వర్ణాంధ్రకు అందరూ సిద్ధమని సంకల్పించాలని చంద్రబాబు పేర్కొన్నారు. 'నీటి సమస్యకు ఏకైక పరిష్కార మార్గం నదుల అనుసంధానం. నదుల అనుసంధానం జరగాలంటే ప్రధాని మోదీకే సాధ్యం. పోలవరం రాష్ట్రానికే జీవనాడి. పోలవరాన్ని 2027 మార్చికి పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. రాబోయే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలో కూడా జరుపుకోబోతున్నాం. గోదావరి నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. వృథాగా వెళ్లే నీటిని దారిమళ్లిస్తే ప్రజలకు సంపద సృష్టించొచ్చు. గోదావరి నీళ్లు కూడా నల్లమల సాగర్‌కు రావాలి. బుధవారం నాడు పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకెళ్తున్నాం. ఉత్తర భారత్‌లో నదుల అనుసంధానానికి అనేక సమస్యలు పరిష్కరించారు. దక్షిణ భారత్‌లో కూడా గోదావరి, కావేరి అనుసంధానం చేయాలి. నదుల అనుసంధానంతో దేశం సుభిక్షంగా ఉంటుందని' చంద్రబాబు స్పష్టం చేశారు. "నాకు రాజకీయం అంటే ఎన్నికలు కాదు. ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడం. ఓట్ల ఆశించి కాదు మార్పు ఆశించి పనిచేస్తా. నెక్స్ట్ ఎన్నికల కోసం కాదు నెక్స్ట్ జనరేషన్ కోసం పనిచేస్తా. నా ఊపిరి ఉన్నంతవరకు తెలుగు జాతి కోసం కష్టపడతా. అందరం కలిసి తెలుగుజాతిని ప్రపంచంలోనే నెంబర్ వన్ చేద్దాం.

# రక్షణ రంగంలో విదేశీ పెట్టుబడులు- నిబంధనలు సడలించే యోచనలో కేంద్ర ప్రభుత్వం!

మొదటి పేజి తరువాయి




భారత్‌కు అందే అవకాశం ఉన్న సందర్భాల్లో ఈ మార్గం ద్వారా పెట్టుబడులకు అనుమతి ఇస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న విధానాన్ని మరింత సులభతరం చేయాలా అనే అంశాన్ని పరిశీలిస్తోంది. ఈ అంశంపై వివిధ వర్గాలతో చర్చలు జరుగుతున్నాయని అధికారిక వర్గాలు వెల్లడించాయి. 'కొంత మేర నిబంధనలను సడలించే అంశం కేంద్రం పరిశీలనలో ఉంది.' అని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ప్రస్తుతం రక్షణ రంగంలో విదేశీ పెట్టుబడులకు హోం మంత్రిత్వ శాఖ నుంచి సెక్యూరిటీ క్లియరెన్స్ ఉండాలి. ఇంకా రక్షణ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు లోబడి ఉండాలి. అయితే రక్షణ రంగానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల పరిమాణం ఇతర కీలక తయారీ రంగాలతో పోలిస్తే ఇంకా తక్కువగానే ఉంది. ఈ నేపథ్యంలోనే ఎఫ్‌డీఐ నిబంధనల్ని మరింత సులభతరం చేయడం ద్వారా అంతర్జాతీయ కంపెనీలను భారత్‌కు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### పెరిగిన రక్షణ రంగ బడ్జెట్- ఎగుమతుల్లో ప్రైవేట్ కంపెనీల హవా

2020 ఏప్రిల్ నుంచి 2026 మార్చి మధ్య కాలంలో భారత రక్షణ పరిశ్రమలు 32.39 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలను ఆకర్షించాయి. దేశీయంగా మేక్ ఇన్ ఇండియాలో భాగంగా రక్షణ తయారీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వరుస చర్యలు చేపట్టింది. ముఖ్యంగా బడ్జెట్ కేటాయింపుల్ని భారీగా పెంచింది. 2013-14లో రూ. 2.53 లక్షల కోట్లుగా ఉన్న రక్షణ రంగ బడ్జెట్, 2026-27 నాటికి ఏకంగా రూ. 7.85 లక్షల కోట్లకు చేరుకుంది. దీనికి తగ్గట్లుగానే ఎగుమతులు కూడా రికార్డు స్థాయిలో పెరిగాయి. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తుల ఎగుమతుల విలువ రూ. 686 కోట్లుగా ఉండగా, ఇది 2025-26 నాటికి రూ. 38,424 కోట్లకు చేరుకోవడం విశేషం. మరోవైపు 2025-26 ఎగుమతుల్లో చూస్తే ప్రైవేట్ రంగ కంపెనీల వాటా 45.16 శాతంగా ఉంది. దీని విలువ రూ. 17,353 కోట్లుగా ఉంది. రక్షణ రంగ ప్రభుత్వ సంస్థల వాటా 54.84 శాతం. దీని విలువ రూ. 21,071 కోట్లు.

### 2029 నాటికి భారీ లక్ష్యాలు- రూ. 50 వేల కోట్ల విలువైన ఎగుమతులు!

రక్షణ ఉత్పత్తుల తయారీ, ఎగుమతులను మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించింది. భారతదేశం 2029 నాటికి రక్షణ రంగంలో ఏటా రూ. 3 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తిని సాధించాలని ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో రూ. 50 వేల కోట్ల విలువైన ఎగుమతులను చేరుకోవడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతోంది. ఈ లక్ష్యాలను సాధించేందుకు దేశీయ తయారీతో పాటు విదేశీ పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా రాబోయే ఎఫ్‌డీఐ సడలింపులు ఈ లక్ష్యాలను చేరుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే నిబంధనల్లో ప్రతిపాదిత సడలింపులు అమల్లోకి వస్తే అంతర్జాతీయ రక్షణ సంస్థలకు భారత్‌లో తయారీ యూనిట్లు, సాంకేతిక భాగస్వామ్యాలు, జాయింట్ వెంచర్ల ఏర్పాటు చేసేందుకు మరింత అవకాశం లభిస్తుంది. దీంతో మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు మరింత ఊతం లభిస్తుందని భావిస్తున్నారు.

# స్మార్ట్‌ఫోన్ తయారీలో 18 శాతానికి చేరిన భారత వాటా

మొదటి పేజి తరువాయి



ఢిల్లీ : ప్రపంచ స్మార్ట్‌ఫోన్ తయారీ రంగంలో భారత్ తన స్థానాన్ని వేగంగా బలోపేతం చేసుకుంటోంది. చైనాలో ఉత్పత్తిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు కంపెనీలు అనుసరిస్తున్న 'చైనా ప్లస్ వన్' వ్యూహం భారత్‌కు కలిసొస్తోంది. తాజా నివేదిక ప్రకారం.. 2025 నాటికి ప్రపంచ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తిలో భారత్ వాటా సుమారు 18 శాతానికి చేరింది. ప్రస్తుతం చైనా 63 శాతం వాటాతో ప్రపంచంలోనే అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ తయారీదారుగా కొనసాగుతోంది. భారత్, వియత్నాం తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ మూడు దేశాలు కలిసి ప్రపంచ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తిలో 90 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయని నివేదిక పేర్కొంది. భారత్‌లో మొబైల్ ఫోన్ల తయారీ పెరగడానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు కీలకంగా మారాయి. ముఖ్యంగా 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం' (పీఎల్ఐ) తయారీదారులను ఉత్పత్తి పెంచేలా ప్రోత్సహిస్తోంది. స్థానికంగా తయారీ పెంచే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందుతున్నాయి. దీంతో పదేళ్లలోపే దేశీయ మొబైల్ ఫోన్ ఉత్పత్తి 20 రెట్లకు పైగా పెరిగింది. ఎగుమతులు 100 రెట్లకు పైగా వృద్ధి చెందాయి. ప్రస్తుతం యాపిల్ తయారు చేసే ఐఫోన్లలో దాదాపు నాలుగో వంతు భారత్‌లోనే అసెంబుల్ అవుతున్నాయి. అమెరికాకు స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేసే అతిపెద్ద వనరుగా కూడా భారత్ ఎదిగింది. గూగుల్ కూడా తన పిక్సెల్ ఫోన్ల తయారీని భారత్ వైపు మళ్లిస్తోంది. 2027 నాటికి కొన్ని పరికరాల తయారీని చైనాలో నిలిపివేయాలని సంస్థ భావిస్తున్నట్లు నివేదిక తెలిపింది. అయితే చైనాను పూర్తిగా పక్కన పెట్టే పరిస్థితి లేదని నిపుణులు చెబుతున్నారు. స్మార్ట్‌ఫోన్లతో పాటు ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు, డిస్‌ప్లే ప్యానెళ్ల తయారీలో చైనాకు ఇప్పటికీ భారీ ఆధిపత్యం ఉంది. అందుకే కంపెనీలు చైనాను పూర్తిగా భర్తీ చేయడం కాకుండా.. ప్రత్యామ్నాయ తయారీ కేంద్రాలను అభివృద్ధి చేసుకుంటున్నాయి. ప్రస్తుతం దిగుమతి చేసుకున్న విడిభాగాలతో ఫోన్లను అసెంబుల్ చేయడం దాటి.. సర్క్యూట్ బోర్డులు, కెమెరా మాడ్యూళ్లు, బ్యాటరీలు, డిస్‌ప్లేలు, సెమీకండక్టర్ల తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. మొబైల్ ఫోన్లలో దేశీయ విలువ జోడింపు సుమారు 23 శాతానికి చేరింది. సెమీకండక్టర్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం 'సెమికాన్ ఇండియా' కార్యక్రమం ద్వారా సుమారు 10 బిలియన్ డాలర్లు కేటాయించింది. చిప్ డిజైన్, తయారీ పరికరాలు, ప్రత్యేక పదార్థాలు, నైపుణ్యం కలిగిన ఇంజినీర్లపై కూడా పెట్టుబడులు పెడుతోంది. 2035 నాటికి 120 నుంచి 150 బిలియన్ డాలర్ల విలువైన సెమీకండక్టర్ వాల్యూ చైన్ నిర్మించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక
మంగళవారం 01-09-2026

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నలుగురు విద్యార్థుల ఎంపిక
### అనకాపల్లి జిల్లా జట్టు తరపున అండర్-14 బాల, బాలికల విభాగాల్లో ప్రాతినిధ్యం



**పాయకరావుపేట, ఆగస్టు 30 ప్రజా న్యూస్ నెట్వర్క్:** మాకవరపాలెంలో ఆగస్టు 30న నిర్వహించిన సాఫ్ట్‌బాల్ ఎంపికల్లో శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌కు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సబ్‌జూనియర్స్ అండర్-14 బాలుర విభాగంలో బి. సార్థక్, డి. నంద కిషోర్, బాలికల విభాగంలో వి. గీతా ప్రవస్తి, కె. రాఘ వర్షిణి ఎంపికైనట్లు విద్యాసంస్థ ప్రధానోపాధ్యాయుడు డి.వి. శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు అనకాపల్లి జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. సెప్టెంబర్ 12 నుంచి 14 వరకు విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్. మూర్తి, కోచ్ విజయ్ తదితరులు అభినందించారు.

## పిల్లల్లో సత్ప్రవర్తన పెంచడం అందరి బాధ్యత
### మైనర్లలో నేరస్వభావం పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

**ఆగస్టు 31 ప్రజా న్యూస్ నెట్వర్కు గుర్రంపోడు :**
ప్రధానంగా 15 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలు దారితప్పుతున్న విషయాన్ని తల్లిదండ్రులు, స్కూళ్లలో ఉపాధ్యాయులు గుర్తించాలి. వారిని సన్మార్గంలో నడపడం అందరూ బాధ్యతగా తీసుకోవాలి.అందుకోసం పాఠశాలలు, గ్రామాల్లో, పట్టణాల్లో తల్లిదండ్రులు, పిల్లలతో కలిపి తరచూ సమావేశాలు నిర్వహించాలి. సహ విద్యార్థులు, బాలికలు, మహిళలతో సోదరభావంతో ఉండేలా నైతిక ప్రవర్తన, క్రమశిక్షణ అలవర్చుకునేలా పిల్లలను తయారుచేయాలి.సెల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు వారిని దూరంగా ఉంచాలి. ఆటలు, వ్యాయామం, సామాజిక అంశాలను పిల్లలకు చిన్నప్పటి నుంచే నేర్పుతూ క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలి.

## జాజిరెడ్డిగూడెంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం
### పార్టీ శ్రేణుల సమక్షంలో కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మందుల సామేలు



**అర్వపల్లి మండలం , ఆగస్టు 31, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:** :
సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి గ్రామ కేంద్రంలో జాజిరెడ్డిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు హాజరై నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మందుల సామేలుకు ఘన స్వాగతం పలికారు. మండలంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండేలా పార్టీ కార్యాలయం కేంద్రంగా పనిచేయాలని నాయకులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల్లో సత్ప్రవర్తన పెంచడం అందరి బాధ్యత
### మైనర్లలో నేరస్వభావం పెరగడం ఆందోళన కలిగిస్తోంది.



**(ఆగస్టు 31 ప్రజా న్యూస్ నెట్వర్కు గుర్రంపోడు)** ప్రధానంగా 15 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలు దారితప్పుతున్న విషయాన్ని తల్లిదండ్రులు, స్కూళ్లలో ఉపాధ్యాయులు గుర్తించాలి. వారిని సన్మార్గంలో నడపడం అందరూ బాధ్యతగా తీసుకోవాలి.అందుకోసం పాఠశాలలు, గ్రామాల్లో, పట్టణాల్లో తల్లిదండ్రులు, పిల్లలతో కలిపి తరచూ సమావేశాలు నిర్వహించాలి. సహ విద్యార్థులు, బాలికలు, మహిళలతో సోదరభావంతో ఉండేలా నైతిక ప్రవర్తన, క్రమశిక్షణ అలవర్చుకునేలా పిల్లలను తయారుచేయాలి.సెల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు వారిని దూరంగా ఉంచాలి. ఆటలు, వ్యాయామం, సామాజిక అంశాలను పిల్లలకు చిన్నప్పటి నుంచే నేర్పుతూ క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలి.

## పంటలు పాడవుతున్నాయి ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయి



అనంతసాగరం 31 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :
అనంతసాగరం మండలంలోని ఆమనిచేరివేళ్ల గ్రామంలో కెతే గుంట క్రషర్ వల్ల నిమ్మ తోటలు నాశనమవ్వడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ గ్రామ రైతులు సోమవారం నెల్లూరు గ్రీవెన్స్ డేలో జిల్లా మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.క్రషర్ నుండి వెలువడే దుమ్ము పొలాలపై దట్టంగా పేరుకుపోవడంతో నిమ్మ తోటల్లో పూత, పిందెలు రాలిపోతున్నాయని పంట దిగుబడి దారుణంగా పడిపోతోందని రైతులు వాపోయారు. కేవలం వ్యవసాయానికే కాకుండా ఈ మసి దుమ్ము వల్ల రైతులు కూలీలు తీవ్రమైన చర్మవ్యాధులు ఊపిరితిత్తుల శ్వాసకోశ సమస్యలతో రోజురోజుకూ అస్వస్థతకు గురవుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.రూ.లక్షలు వెచ్చించి పెంచుకున్న తోటలు కళ్ల ముందే ఎండిపోతుంటే తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని కన్నీటి పర్యంతమయ్యారు.పంటలను, ప్రజల ప్రాణాలను బలితీసుకుంటున్న కెతే గుంట క్రషర్ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఈ క్రషర్‌పై మైనింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ ఫిర్యాదుపై అధికారులు తక్షణమే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## గోదావరి జలాల కార్యక్రమానికి తుని నుంచి ప్రజల తరలింపు
### సెప్టెంబర్ 2న పాయకరావుపేటలో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో టీడీపీ నాయకులతో సమీక్షించిన యనమల దివ్య



**తుని, ఆగస్టు 31 ప్రజా న్యూస్ నెట్వర్క్:** ఉత్తరాంధ్ర జిల్లాలకు గోదావరి జలాలను అందించే కార్యక్రమం ద్వారా ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరుతోందని ప్రభుత్వ విప్ యనమల దివ్య అన్నారు. సెప్టెంబర్ 2న పాయకరావుపేటలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనే కార్యక్రమానికి తుని నియోజకవర్గం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు.తాండవ షుగర్ ఫ్యాక్టరీ వద్ద నిర్వహించే జలహారతి, పీఎల్ పురంలో జరిగే బహిరంగ సభకు సంబంధించి ఏర్పాట్లపై యనమల దివ్య తుని కూటమి కార్యాలయంలో పార్టీ పరిశీలకులు, టీడీపీ నాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలను తీసుకువస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో పేర్కొన్న విధంగా కార్యక్రమం జరుగుతోందని యనమల దివ్య అన్నారు. పోలవరం ఎడమ కాలువ నిర్మాణం కోసం తమ ఇళ్లను కోల్పోయినా ఉత్తరాంధ్ర ప్రాంతం సస్యశ్యామలం కావాలనే ఉద్దేశంతో కుమ్మరిలోవలోని ప్రజలు తమ నివాసాలను ఖాళీ చేశారని తెలిపారు.పోలవరం ఎడమ కాలువ నిర్మాణం కోసం సహకరించిన కుమ్మరిలోవ ప్రజల త్యాగాన్ని గుర్తిస్తున్నామని యనమల దివ్య పేర్కొన్నారు. నిర్వాసితుల కోసం ఆధునిక వసతులతో టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.సెప్టెంబర్ 2న జరిగే ముఖ్యమంత్రి కార్యక్రమానికి తుని నియోజకవర్గం నుంచి 6,000 మంది స్వచ్ఛందంగా హాజరయ్యేందుకు ముందుకు వచ్చారని యనమల దివ్య తెలిపారు. వారి రాక కోసం 100 బస్సులను సమకూర్చినట్లు చెప్పారు.ఈ సమావేశంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొంతం కొండబాబు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్ రావు, అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి, తుని నియోజకవర్గ పరిశీలకుడు ఎర్రా వేణుగోపాలరాయుడు, లోడగల కృష్ణ, రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రి పాల్గొన్నారు. అలాగే సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, యినుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి సత్యనారాయణ, అంకంరెడ్డి రమేష్, పోతల సూరిబాబు, మల్ల గణేష్, కుండల రామకృష్ణ, కుక్కడపు బాలాజీ, పరవాడ తాతబాబు, తమరాన వరలక్ష్మీ తదితరులు హాజరయ్యారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట



**సంగారెడ్డి, ఆగస్టు 31, ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**
కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ ఏడు రోజుల నిరసన కార్యక్రమాలకు సిద్ధమైంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు 'కాంగ్రెస్ 1000 రోజుల పాలన -- 420 మోసాలు' పేరుతో నిర్వహించనున్న కార్యక్రమాలపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీలకు చెందిన ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఏడు రోజుల కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడంతో పాటు మరిన్ని ప్రయోజనాలు అందిస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ 'బాకీ కార్డులు' ప్రతి ఇంటికి చేరవేయాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. రానున్నది తమ ప్రభుత్వమేనని, మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన అన్నారు. తన గెలుపు కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు, ప్రజల రుణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేనని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా ఎవరికీ నష్టం కలిగించాలనే ఆలోచన తనకు లేదని, రాజకీయ జీవితంలో తాను ఎదుర్కొన్న అవమానాలు ఇతరులకు ఎదురుకాకూడదని భావిస్తానని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్ర గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ బాకీ కార్డులను గడపగడపకు అందించాలని సూచించారు. ఏడు రోజుల కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. సెప్టెంబర్ 2న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ధర్నాలు, బాకీ కార్డుల పంపిణీ, 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన, ప్రెస్‌మీట్ నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 3న వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, యూరియా, రైతు బీమా అంశాలపై రైతు సదస్సులు చేపడతారు. సెప్టెంబర్ 4న వృద్ధులు, వికలాంగులు, మహిళల సమస్యలపై సదస్సులు, వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 5న విద్యార్థులు, యువత సమస్యలపై ర్యాలీలు చేపట్టి ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ తదితర హామీల అమలును ప్రశ్నించనున్నారు. సెప్టెంబర్ 6న గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్యలపై నిరసనలు, సెప్టెంబర్ 7న జిల్లా, మండల ప్రజావాణి కేంద్రాల్లో హామీల అమలుపై వినతిపత్రాలు సమర్పించనున్నారు. సెప్టెంబర్ 8న జిల్లా కేంద్రంలో ఏడు రోజుల కార్యక్రమాలపై ప్రెస్‌మీట్ నిర్వహించి అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించనున్నారు. సెప్టెంబర్ 10న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు చేపట్టే నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ తరఫున సంఘీభావం ప్రకటించనున్నారు. ఈ సమావేశంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, సీనియర్ నాయకులు హకీమ్, డాక్టర్ శ్రీహరి, మాజీ జడ్పీటీసీలు మనోహర్ గౌడ్, కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, విఠల్, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 2 నుంచి వారంపాటు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు తాజా నివేదికలు కూడా పేర్కొంటున్నాయి.

## సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 30 పోలీస్ యాక్ట్
### అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు నిర్వహిస్తే కఠిన చర్యలు



**సంగారెడ్డి, ఆగస్టు 31, ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**
శాంతి భద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీస్ యాక్ట్--1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ తెలిపారు. ఈ మేరకు జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లాలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని సూచించారు. అనుమతి లేకుండా బహిరంగ కార్యక్రమాలు నిర్వహించడం, రహదారులపై రాస్తారోకోలు చేపట్టడం, ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రజాధనానికి నష్టం కలిగించే, శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. ప్రజలు తమ సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారుల దృష్టికి తీసుకెళ్లే సమయంలో పోలీసుల ముందస్తు అనుమతి తీసుకోవాలని, అనుమతులు లేకుండా ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టవద్దని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించేందుకు పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ పరితోష్ పంకజ్ కోరారు.

## నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలి
### జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయం చేయాలి- ధూళిపాల శ్రీనివాసరావు



**(హుజూర్ నగర్ మండల) ప్రతినిధి ఆగస్టు 31,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు జనాభా ప్రాతిపదికన సముచిత ప్రాధాన్యత కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ధూళిపాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం హుజూర్నగర్‌లో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో బీసీలు 52 శాతం ఉన్నప్పటికీ నామినేటెడ్ పదవులు, వివిధ ప్రభుత్వ అనుబంధ సంస్థలు, కమిటీలు, దేవాలయ కమిటీలు, గ్రంథాలయ సంస్థలు తదితర పదవుల్లో బీసీలకు ఆశించిన స్థాయిలో ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, పరిపాలనా పరంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అధిక జనాభా కలిగిన బీసీ సామాజిక వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా వారి రాజకీయ, సామాజిక భాగస్వామ్యాన్ని గుర్తించి నామినేటెడ్ పదవుల కేటాయింపులో న్యాయం చేయాలని కోరారు. ఎన్నో సంవత్సరాలుగా బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న అన్యాయాన్ని తొలగించేందుకు ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు రావాలని, బీసీలకు దక్కాల్సిన అవకాశాలను ఇతర వర్గాలతో సమానంగా కల్పించాలని ఆయన అన్నారు. ముఖ్యంగా విశ్వబ్రాహ్మణ, పద్మశాలి, నాయి బ్రాహ్మణ, కుమ్మరి, రజక తదితర బీసీ సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బీసీ నాయకులు, కార్యకర్తలను గుర్తించి వారికి తగిన రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. హుజూర్నగర్ నియోజకవర్గంలో కూడా నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు సముచిత స్థానం కల్పించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదర్శంగా నిలవాలని ధూళిపాల శ్రీనివాసరావు కోరారు. ముఖ్యంగా హుజూర్నగర్ గ్రంథాలయ చైర్మన్ పదవితో పాటు వివిధ దేవాలయ కమిటీలు, ఇతర నామినేటెడ్ పదవుల్లో బీసీ సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు అవకాశాలు కల్పించడం వల్ల కేవలం ఒక సామాజిక వర్గానికి ప్రయోజనం కలిగినట్లు కాకుండా సమాజంలో అన్ని వర్గాల భాగస్వామ్యం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా బీసీ నాయకుల అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలించి, జనాభా ప్రాతిపదికన నామినేటెడ్ పదవుల్లో బీసీలకు తగిన వాటా కల్పించే దిశగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు తమ సంఘం తరపున ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు బొడ్డు గోవిందరావు, సంగిశెట్టి వెంకటేశ్వర్లు, ఒట్టికూటి శ్రీనివాస్ గౌడ్, కర్నే కృష్ణ, గంజి శివ, హనుమంతరావు, నిమ్మనగోటి శివకుమార్, బండి నాగేశ్వరరావు, కర్నే వెంకటేశ్వర్లు తదితర బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 3 నుంచి హుజూర్‌నగర్‌లో ముత్యాలమ్మ జాతర
### భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు.. ప్రభబండ్ల వైభవంతో పండుగ సందడి

**(హుజూర్‌నగర్ మండలం), ఆగస్టు 31, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:**
హుజూర్‌నగర్ పట్టణంలో ముత్యాలమ్మ తల్లి జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సెప్టెంబర్ 3వ తేదీ నుంచి వరుసగా జరిగే అమ్మవారి జాతరలతో హుజూర్‌నగర్ పట్టణం భక్తి, సంప్రదాయం, ఉత్సవ సందడితో కళకళలాడనుంది. హుజూర్‌నగర్‌లో ముసలి ముత్యాలమ్మ తల్లి, పెద్ద ముత్యాలమ్మ తల్లి, చిన్న ముత్యాలమ్మ తల్లి అమ్మవార్లను భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో కొలుస్తూ ప్రతి ఏడాది జాతరలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ జాతరలకు హుజూర్‌నగర్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కుబడులు చెల్లించుకోనున్నారు. సెప్టెంబర్ 3వ తేదీ గురువారం నుంచి జాతర కార్యక్రమాలు ప్రారంభం కానుండగా, సెప్టెంబర్ 6న పెద్ద ముత్యాలమ్మ తల్లి జాతర, సెప్టెంబర్ 7న చిన్న ముత్యాలమ్మ తల్లి జాతర నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం సెప్టెంబర్ 10వ తేదీన కనకదుర్గమ్మ అమ్మవారి జాతర కూడా నిర్వహించనున్న నేపథ్యంలో వరుసగా జరిగే అమ్మవారి ఉత్సవాలతో హుజూర్‌నగర్ పట్టణంలో పండుగ వాతావరణం నెలకొననుంది. జాతరలో భాగంగా బోనాలు సమర్పించడం, ప్రత్యేక పూజలు, అమ్మవారికి మొక్కుబడులు చెల్లించడం, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించడం వంటి వేడుకలు కొనసాగనున్నాయి. ముఖ్యంగా హుజూర్‌నగర్ బోనాల జాతరలో భక్తుల మొక్కుబడులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. పలువురు భక్తులు తమ కుటుంబ సంప్రదాయాలు, విశ్వాసాల ప్రకారం అమ్మవారి వద్ద మొక్కులు చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. జాతర సందర్భంగా బోనాలు సమర్పించే మహిళలు, అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులు, సంప్రదాయ పూజా కార్యక్రమాలు, భక్తుల సందడి పట్టణంలో ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకురానుంది. అదే సమయంలో జాతరలో ప్రభబండ్ల ఊరేగింపులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. భక్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ప్రభబండ్లను సంప్రదాయబద్ధంగా ఊరేగిస్తూ అమ్మవారికి మొక్కులు చెల్లించనున్నారు. ప్రభబండ్ల ఊరేగింపు, బోనాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారి నామస్మరణతో జాతర వైభవం మరింత పెరగనుంది. జాతరకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో పట్టణంలో భద్రతా ఏర్పాట్లకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆలయాల పరిసర ప్రాంతాలు, జాతర ప్రదేశాలు, ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టనున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు జాతర సమయంలో ప్రజల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. జాతర సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పట్టణానికి చేరుకునే అవకాశం ఉండటంతో నిర్వాహకులు, సంబంధిత అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ముత్యాలమ్మ తల్లి జాతరను ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించడం హుజూర్‌నగర్‌కు ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది. ఈసారి కూడా జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతుండటంతో హుజూర్‌నగర్ పట్టణం సెప్టెంబర్ 3 నుంచి వరుస ఉత్సవాలతో సందడిగా మారనుంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు.

## పాయకరావుపేటలో సీఎం పర్యటనకు తుది ఏర్పాట్లు
### జలహారతి, బహిరంగ సభ ప్రాంగణాలను పరిశీలించిన హోం మంత్రి అనిత



**పాయకరావుపేట, ఆగస్టు 31 ప్రజా న్యూస్ నెట్వర్క్:**
సెప్టెంబర్ 2న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాయకరావుపేటలో పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం ఆయా ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.పోలవరం ఎడమ కాలువ వద్ద నిర్వహించనున్న జలహారతి కార్యక్రమానికి జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి ముందుగా పరిశీలించారు. అనంతరం పాయకరావుపేట మార్కెట్ యార్డు వెనుక సిద్ధం చేస్తున్న బహిరంగ సభ ప్రాంగణానికి వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి పాల్గొనే ప్రధాన వేదికతో పాటు ఇతర ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను అందించే కార్యక్రమంలో భాగంగానే పోలవరం ఎడమ కాలువ వద్ద జలహారతి నిర్వహించనున్నట్లు అనిత తెలిపారు. ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను సూచించారు.జలహారతి, బహిరంగ సభ, వేదిక ఏర్పాట్లతో పాటు భద్రత, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను సజావుగా నిర్వహించాలని సూచించారు.ఈ పరిశీలనలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ జోన్ వన్ కోర్డినేటర్ బెందాళం అశోక్, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్యతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు కాంపాటి శ్రీనివాస్‌కు ఘన సన్మానం-గుండెపంగు రమేష్



**(కోదాడ మండలం), ఆగస్టు 31, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:**
సూర్యాపేట జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపికైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాంపాటి శ్రీనివాస్‌కు కోదాడ పట్టణంలో ఘన సన్మానం నిర్వహించారు. సోమవారం కోదాడ పట్టణంలోని అమ్మ మెడికల్ ఏజెన్సీ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండెపంగు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంపాటి శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుండెపంగు రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, పార్టీ కార్యక్రమాల బలోపేతానికి సుదీర్ఘకాలంగా కష్టపడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందనడానికి కాంపాటి శ్రీనివాస్‌కు లభించిన ఈ అవకాశం నిదర్శనమన్నారు. పార్టీ కోసం నిరంతరం పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో తన వంతు పాత్ర పోషిస్తున్న కాంపాటి శ్రీనివాస్ సేవలను గుర్తించి సూర్యాపేట జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించిన రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు, ముఖ్యంగా అణగారిన వర్గాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన బాధితులకు చట్టప్రకారం సకాలంలో న్యాయం అందేలా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, బాధితులకు అవసరమైన సహాయం, పునరావాస చర్యలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయడంతో పాటు ఎక్కడైనా అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటే వాటిని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కమిటీ లక్ష్యాలకు అనుగుణంగా పారదర్శకంగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. కష్టపడి పనిచేసే కాంగ్రెస్ కార్యకర్తలకు పదవులు కేవలం గౌరవం మాత్రమే కాకుండా ప్రజలకు సేవ చేసే మరింత పెద్ద బాధ్యతను అప్పగించినట్లేనని గుండెపంగు రమేష్ పేర్కొన్నారు.కాంపాటి శ్రీనివాస్‌కు లభించిన ఈ పదవితో ఎస్సీ, ఎస్టీ బాధితుల సమస్యలను మరింత సమర్థవంతంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్ బషీర్, బార్ అసోసియేషన్ నాయకుడు గాలి శ్రీనివాస్ నాయుడు, పాస్టర్ యెషయా, నాయకులు ఖాజా గౌడ్, ఎస్కే మునీర్, పిడతల శ్రీనివాస్, బరపటి కోటేశ్వరరావు, పాలడుగు సంజీవ్, గంధం జాని, కాంపాటి రామకృష్ణ, గజ్జి మస్తాన్ తదితరులు పాల్గొని కాంపాటి శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

## సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలు..
### సెప్టెంబర్ 30 వరకు శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు.. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలకు అవకాశం లేదు: జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ




**సూర్యాపేట జిల్లా, ఆగస్టు 31, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:**
సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 30వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటం, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం, అవాంఛనీయ సంఘటనలకు అడ్డుకట్ట వేయడం, ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడం లక్ష్యంగా పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలన్నా ముందస్తుగా సంబంధిత పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ప్రజా రహదారులపై గుంపులుగా చేరడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం, ప్రజల సాధారణ రాకపోకలకు ఆటంకం కలిగించడం వంటి చర్యలను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తారని ఎస్పీ తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించేందుకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని, శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. అనుమతి అవసరమైన కార్యక్రమాల నిర్వాహకులు ముందుగానే సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించి నిబంధనల ప్రకారం అనుమతులు పొందాలని సూచించారు. పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న కాలంలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ హెచ్చరించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతలు, సాధారణ ప్రజాజీవనం సజావుగా కొనసాగించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## చంద్రబాబు పర్యటనకు అనకాపల్లి జిల్లాలో 1,600 మందితో భద్రత
### పాయకరావుపేటలో జలహారతి కార్యక్రమం నేపథ్యంలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ పూర్తి.. క్షేత్రస్థాయి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



**పాయకరావుపేట, ఆగస్టు 31 ప్రజా న్యూస్ నెట్వర్క్:**
సెప్టెంబర్ 2న పాయకరావుపేటలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో అనకాపల్లి జిల్లా పోలీసులు భద్రతా ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల సందర్భంగా నిర్వహించే 'జలహారతి' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పర్యటన ప్రాంతాల్లో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) ప్రక్రియను నిర్వహించి భద్రతా చర్యలను సమీక్షించారు.జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఐఏఎస్, జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, ఐఏఎస్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు సోమవారం పర్యటన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెలిప్యాడ్, జలహారతి జరిగే ప్రాంతం, సభా ప్రాంగణాలు, ముఖ్య మార్గాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలను సమీక్షించారు.ముఖ్యమంత్రి పర్యటనను ప్రశాంతంగా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్, ఎస్పీ తెలిపారు. మొత్తం సుమారు 1,600 మంది పోలీసు సిబ్బందిని భద్రతా విధుల్లో మోహరిస్తున్నట్లు పేర్కొన్నారు.భద్రతా విధుల్లో 03 అదనపు ఎస్పీలు, 09 డీఎస్పీలు, 36 సీఐలు, 90 ఎస్ఐలు, 150 ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, 427 మంది కానిస్టేబుళ్లు, 150 మంది మహిళా కానిస్టేబుళ్లు, 249 మంది హోంగార్డులు పాల్గొననున్నారు. అదనంగా రోప్ పార్టీలు, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్స్, డాగ్ స్క్వాడ్, స్పెషల్ పార్టీ బలగాలను కూడా అందుబాటులో ఉంచుతున్నారు.పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి హెలిప్యాడ్‌కు చేరుకున్న అనంతరం పోలవరం ఎడమ కాలువ వద్ద నిర్వహించే జలహారతి పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం బహిరంగ సభ, పార్టీ కార్యకర్తల సమావేశంతో పాటు వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.విధుల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణాలు, ముఖ్య మార్గాల్లో నిరంతరం తనిఖీలు చేపట్టాలని, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ బృందాలు పర్యటన పూర్తయ్యే వరకు నిఘా కొనసాగించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఏఎస్-ఎల్ సమీక్షలో స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ (ఎస్ఎస్జీ) అడిషనల్ డైరెక్టర్ కె.శ్రీనివాస రావు, అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, ఆర్డీవోలు కె.వి.రామలక్ష్మి, వీ.వీ.రమణ, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, పరవాడ ఇన్చార్జి డీఎస్పీ బి.మోహన రావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ కె.రవికుమార్ పాల్గొన్నారు.అలాగే డీఎస్పీలు, సీఐలు బాల సూర్యారావు, వినోద్ బాబు, గఫూర్, వెంకటనారాయణ, ధనుంజయ రావు, అశోక్ కుమార్, ఎస్సైలు పురుషోత్తం, అలీ షరీఫ్ తదితర జిల్లా స్థాయి అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

## కొమ్మనాపల్లి నుంచి 30 మంది టీడీపీలో చేరిక
### యనమల రామకృష్ణుడు సమక్షంలో పార్టీలో చేరిన నేతలు.. గ్రామాభివృద్ధికి సమష్టి కృషి చేయాలని పిలుపు




**తుని ఆగస్టు 31 ప్రజా న్యూస్ నెట్వర్క్:**
తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామానికి చెందిన 30 మంది టీడీపీలో చేరారు. సీనియర్ నేత యనమల రాజేష్ పర్యవేక్షణలో గ్రామ టీడీపీ నేతలు కోన నాగేశ్వరరావు, కోన రాంబాబు ఆధ్వర్యంలో వారు మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు సమక్షంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం అందరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో తుని మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి, తొండంగి మండల తెలుగు యువత అధ్యక్షుడు బంటుపల్లి అన్వేష్, అరిగెల నర్సింహమూర్తితో పాటు స్థానిక నేతలు శివకోటి సహదేవుడు, కుర్రా సోమరాజు, కుర్రా వెంకట్రావు, వాసపల్లి శంకర్రావు, కాకాడ నాని బాబు, కాకాడ వినోద్ కుమార్, యిందన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## యాతవాకిళ్ల వేములూరు ప్రాజెక్టుకు నీటి విడుదల
### ఉత్తమ్ ఆదేశాలతో సాగర్ ఎడమ కాలువ నుంచి నీరు.. ఆయకట్టు రైతుల్లో హర్షం



**(మఠంపల్లి మండలం), ఆగస్టు 31, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:**
యాతవాకిళ్ల వేములూరు ప్రాజెక్టును నింపేందుకు మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు సాగర్ ఎడమ కాలువలోని పానుగోడు రిజర్వాయర్ ఎస్కేప్ నుంచి నీటిని విడుదల చేశారు.ప్రాజెక్టుకు నీరు చేరేలా అధికారులు చర్యలు చేపట్టారు. నీటి విడుదలతో ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి భరోసా పెరగడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పంటల సాగుకు కీలక సమయంలో ప్రాజెక్టుకు నీరు అందడం రైతులకు ఎంతో ఊరటనిచ్చిందని గ్రామ ప్రజలు తెలిపారు. ఆయకట్టు చివరి భూముల వరకు నీరు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని రైతులు కోరారు.
వేములూరు ప్రాజెక్టుకు నీటి విడుదలతో రైతుల సాగునీటి ఆశలకు బలం చేకూరిందని, ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో తమకు సాగునీటి భరోసా ఏర్పడిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.




## ఫీచర్ ఫోన్లకూ యూపీఐ చెల్లింపులు..

- **'యూపీఐ 123పే' సేవలు ప్రారంభించిన ఫోన్‌పే**
- **ఇంటర్నెట్ లేకుండానే డిజిటల్ చెల్లింపులు**
- **2జీ నెట్‌వర్క్‌లోనూ పనిచేసేలా సేవలు**
- **20 కోట్ల మంది ఫీచర్ ఫోన్ వినియోగదారులకు ప్రయోజనం**
- **12 భారతీయ భాషల్లో ఏఐ వాయిస్ అసిస్టెంట్**
- **క్యూఆర్ స్కాన్‌తోనూ చెల్లింపులు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:**
స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ సౌకర్యం పరిమితంగా ఉన్న గ్రామీణ ప్రాంతాలకు డిజిటల్ చెల్లింపులను చేరువ చేసేందుకు ఫోన్‌పే 'యూపీఐ 123పే' సేవలను సోమవారం ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ఉన్న 20 కోట్లకు పైగా ఫీచర్ ఫోన్ వినియోగదారులు ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే యూపీఐ చెల్లింపులు చేసుకునేలా ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. సాధారణ 2జీ నెట్‌వర్క్‌లోనూ పనిచేసేలా ఎస్సెమ్మెస్ సాంకేతికతతో ఈ సేవలను రూపొందించారు.

**ఫీచర్ ఫోన్లలోనే యూపీఐ**
మొబైల్ నంబర్ లేదా యూపీఐ ఐడీ ద్వారా ఇతరులకు డబ్బులు పంపే సౌకర్యం ఈ సేవల్లో ఉంది. కెమెరా ఉన్న ఫోన్లలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వ్యాపారులకు చెల్లింపులు చేయవచ్చు. బ్యాంకు ఖాతా బ్యాలెన్స్, లావాదేవీల వివరాలను కూడా తెలుసుకునే అవకాశం ఉంది. త్వరలో మొబైల్ రీఛార్జ్, బిల్లుల చెల్లింపుల సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఫోన్‌పే తెలిపింది.

**ఏఐ వాయిస్ అసిస్టెంట్**
యూపీఐ సేవలను సులభంగా యాక్టివేట్ చేసుకునేందుకు ఫోన్‌పే ప్రత్యేక ఏఐ ఆధారిత వాయిస్ అసిస్టెంట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇంగ్లీష్‌తో పాటు 12 భారతీయ భాషల్లో ఈ సహాయక సేవ పనిచేస్తుంది. ఫీచర్ ఫోన్ వినియోగదారులకు యూపీఐ సేవల వినియోగంలో ఇది మార్గనిర్దేశం చేయనుంది.

**సులభంగా ఖాతా యాక్టివేషన్**
ఫీచర్ ఫోన్‌లో ఫోన్‌పే యాప్‌ను తెరిచి నిబంధనలను అంగీకరించిన తర్వాత బ్యాంకును ఎంచుకోవాలి. అనంతరం డెబిట్ కార్డు చివరి ఆరు అంకెలు, గడువు తేదీ నమోదు చేసి యూపీఐ పిన్ సెట్ చేసుకోవాలి. దీంతో ఖాతా యాక్టివేట్ అవుతుంది.

**సెకన్లలో లావాదేవీ పూర్తి**
చెల్లింపుల సమయంలో 'పే టు మొబైల్' లేదా 'పే టు యూపీఐ ఐడీ' ఆప్షన్‌ను ఎంచుకుని వివరాలు, మొత్తాన్ని నమోదు చేసి యూపీఐ పిన్ నమోదు చేస్తే లావాదేవీ పూర్తవుతుంది. కెమెరా ఉన్న ఫీచర్ ఫోన్లలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కూడా చెల్లింపులు చేయవచ్చు.

## నోయిడాలో మరో నిర్భయ ఘటన

- **కదులుతున్న బస్సులో బాలికపై సామూహిక అత్యాచారం**
- **16 ఏళ్ల బాలికపై ఇద్దరి దారుణం**

**నోయిడా, ఆగస్టు 31:**
గ్రేటర్ నోయిడాలో 16 ఏళ్ల బాలికపై కదులుతున్న బస్సులో సామూహిక అత్యాచారం జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఆగస్టు 4న జరిగిన ఈ ఘటనలో బస్సు డ్రైవర్ కుల్దీప్ (39), కండక్టర్ సందీప్ (26)ను పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తర ఢిల్లీలోని తిమార్‌పూర్ ప్రాంతంలోని పార్కింగ్ స్థలం నుంచి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

**బంధువుల ఇంటికి వెళ్తుండగా..**
ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురికి చెందిన బాలిక కుటుంబ సభ్యులకు చెప్పకుండా నోయిడాలోని బంధువుల ఇంటికి బయలుదేరింది. భారీ వర్షం, చీకటి సమయంలో పరి చౌక్ వద్ద దిగిన ఆమె.. బంధువుల ఇంటికి వెళ్లేందుకు వాహనం కోసం ఎదురుచూస్తోంది. అప్పటికే రాత్రి 9 గంటలు దాటింది.

**బస్సులోకి ఎక్కిన బాలిక**
అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ స్లీపర్ బస్సును బాలిక ఎక్కింది. తాము కూడా నోయిడా సెక్టార్ 63 వైపు వెళ్తున్నామని కండక్టర్ చెప్పడంతో ఆమె బస్సులోకి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆ బస్సు వాస్తవానికి సూరజ్‌పూర్‌లోని వర్క్‌షాప్ నుంచి తిరిగి వస్తోంది. బస్సు కదిలిన కొద్దిసేపటికే నిందితులు బాలికపై లైంగిక దాడికి పాల్పడి, ప్రతిఘటిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించినట్లు పోలీసులు వెల్లడించారు.

**ఢిల్లీలో వదిలివేత**
లైంగిక దాడి అనంతరం బాలికను ఢిల్లీలోని కశ్మీర్ గేట్ సమీపంలోని రింగ్ రోడ్ వద్ద వదిలేసి నిందితులు పరారైనట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాలిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**బస్సులో కీలక ఆధారాలు**
దర్యాప్తులో భాగంగా పోలీసులు బస్సును స్వాధీనం చేసుకున్నారు. బస్సులోని స్లీపర్ బెర్త్‌లకు ఉన్న కర్టెన్లను నిందితులు తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఫోరెన్సిక్ బృందం బస్సులో బాలికకు సంబంధించిన ఆధారాలను సేకరించింది.

**సీసీటీవీ ఫుటేజీల పరిశీలన**
నిందితులు ఇద్దరూ విశ్వనాథ్ ట్రావెల్స్ అనే ప్రైవేట్ సంస్థలో రెండేళ్లకు పైగా పనిచేస్తున్నట్లు సమాచారం. వారిని అరెస్టు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బస్సు ప్రయాణించిన మార్గంలోని సీసీటీవీ ఫుటేజీలను సేకరించి పరిశీలిస్తున్నారు. తాజా ఘటన 2012లో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటనను మరోసారి గుర్తుచేస్తోంది.

## పెజెష్కియాన్‌తో మోడీ కీలక భేటీ..

- **ఉద్రిక్తతల వేళ భారత్-ఇరాన్ సంబంధాలపై చర్చ**

**బిష్కెక్, ఆగస్టు 31:**
షాంఘై సహకార సంస్థ సదస్సు కోసం కిర్గిజిస్థాన్‌లో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ.. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. రాజధాని బిష్కెక్‌లో జరిగిన ఈ భేటీలో భారత్‌ఇరాన్ సంబంధాల తాజా పరిస్థితిపై ఇరువురు నేతలు సమీక్షించారు. పరస్పర ప్రయోజనం ఉన్న రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసి విస్తరించాల్సిన అవసరంపై చర్చించారు.

**యుద్ధం తర్వాత తొలిసారి భేటీ**
ఫిబ్రవరిలో ఇరాన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత మోడీ, పెజెష్కియాన్ ప్రత్యక్షంగా సమావేశం కావడం ఇదే తొలిసారి. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీతో పాటు పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**ఉద్రిక్త పరిస్థితుల్లో కీలక భేటీ**
అమెరికాఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో మోడీపెజెష్కియాన్ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా ఉన్న సమయంలో ఇరువురు నేతలు భేటీ అయ్యారు. ఇరాన్ భారత్‌కు టాప్ 10 వాణిజ్య భాగస్వాముల్లో ఒకటిగా ఉన్నప్పటికీ.. హార్ముజ్ జలసంధి మూసివేత, ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు ఇరు దేశాల ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నాయి.

**ఫోన్‌లోనూ చర్చలు**
అంతకుముందు మార్చి 21న మోడీ, పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితిపై విస్తృతంగా చర్చించారు. జూన్‌లోనూ ఇరువురు నేతలు మరోసారి ఫోన్‌లో సంభాషించారు. ఆ సమయంలో మధ్యప్రాచ్య పరిణామాలను పెజెష్కియాన్ మోడీకి వివరించారు. ఘర్షణను ముగించేందుకు కుదిరిన అవగాహనను మోడీ స్వాగతిస్తూ.. శాశ్వత శాంతి, స్థిరత్వం కోసం నిరంతర ప్రయత్నాలు అవసరమని స్పష్టం చేశారు.